క్లుప్తంగా

శుభకార్యం

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం టంగుటూరు గ్రామానికి చెందిన జి. వెంకటశివుడు కుమారుడి పెళ్లి జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జియారత్



ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని ఎం. గోవిందిన్నె మెట్టమీద వెలసిన మీరావలి దర్గాలో శనివారం భక్తిశ్రద్ధలతో జియారత్ వేడుకలు నిర్వహించారు. మొహర్రం ముగిసిన 40వ రోజున జియారత్ వేడుకలను పురస్కరించుకుని దర్గా కమిటీ అధ్యక్షుడు సత్యరాజు ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పూలదట్టీలు, జెండాలతో ఊరేగింపుగా మీరావలి పీరును అలంకరించారు. అనంతరం ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్గా ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి రాకపోకలు కొనసాగిస్తే చర్యలు తప్పవని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఆటో స్టాండ్ వద్ద డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రస్తుతం అమలవుతున్న కొత్త వాహన చట్టం అనుగుణంగా వాహనాలను నడపాలన్నారు. ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సురెన్స్, తదితర రికార్డులు కల్గి ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

చెరువుల్లోకి స్వల్పంగా చేరిన వర్షపునీరు



తిమ్మనాయినపేట చెరువులో చేరిన నీళ్లు

కొలిమిగుండ్ల: వర్షాకాలంలో చెరువులన్నీ నిండుకుండలా ఉండాలి. అయితే, సరైన వర్షాలు లేకపోవడంతో అవి వెలవెలబోతున్నాయి. నాలుగైదు రోజుల నుంచి కురుస్తున్న వానలకు మండలంలోని తిమ్మనాయినపేట, కొలిమిగుండ్ల–నాయినపల్లె సమీపంలోని సద్దలవెంగన్న, హనుమంతుగుండం చెరువులకు స్వల్పంగా నీళ్లు వచ్చి చేరాయి. రెండేళ్ల నుంచి ఆశించిన వర్షాలు లేక పంటలు పండక అవస్థలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

సామూహిక జంధ్యం మార్పిడి



జంధ్యం మార్పిడికి హాజరైన ఆర్యవైశ్యులు

డోన్ టౌన్ : శ్రావణ మాసం జంధ్యాల పౌర్ణమి పురస్కరించుకొని శనివారం స్థానిక అమ్మవారి శాలలో సామూహిక జంధ్యాల మార్పిడి కార్యక్రమాన్ని ఆవోపా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమం జరిపించారు. ఇందుకు పట్టణానికి చెందిన 60 మంది ఆర్యవైశ్య సంఘీయులు హాజరై శాస్త్రోక్తంగా జంధ్యం మార్పిడిలో పాల్గొన్నారు.

కమ్ముకున్న పొగమంచు



ప్యాపిలి వద్ద కమ్మేసిన పొగమంచు

ప్యాపిలి: మండల కేంద్రంలో శనివారం వేకువ జామున భారీ వర్షం కురిసింది. దీంతో ఉదయాన్నే పట్టణాన్ని పొగమంచు కమ్మేసింది. పొగమంచు కారణంగా వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9 గంటలైనా పొగమంచు వీడకపోవడంతో లైట్లు వేసుకుని ప్రయాణించారు.

గురుకులకు చంద్ర గ్రహణం!

- ఆగిపోయిన జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల నిర్మాణం
- పనులపై దృష్టిసారించని కూటమి సర్కారు
- బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో గురుకుల పాఠశాల నిర్వహణ
- సరైన వసతులు లేక విద్యార్థుల ఇక్కట్లు



అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు



అసౌకర్యాల మధ్య భోజనం చేస్తున్న విద్యార్థులు

బనగానపల్లె: బడుగు,బలహీన వర్గాల పిల్లలు చదువుకునే గురుకుల పాఠశాలపై చంద్రబాబు సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పెండింగ్ పనులు పూర్తి చేయడం లేదు.దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడంతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తుంది. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీ విద్యార్థుల కోసం బనగానపల్లెకు మహాత్మాజ్యోతి రావుపూలే బీసీ గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. సొంత భవనం లేకపోవడంతో అప్పటికప్పుడు బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో తాత్కాలికంగా తరగతులు ప్రారంభించింది. ఒకే చోట రెండు నిర్వహణ ఇబ్బందిగా మారింది. దీంతో 2023లో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమస్యను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పక్కా భవన నిర్మాణానికి రూ.2.36 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో వెంటనే బనగానపల్లె పట్టణ సమీపంలోని రవ్వలకొండపై గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు చురుగ్గా సాగుతున్న సమయంలో అంటే 2024లో కూటమి సర్కారు ఏర్పడింది. అప్పటి నుంచి ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నేటికీ అదే పరిస్థితి నెలకొనడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉండి ఉంటే ఈ సమయానికి అన్ని వసతులతో గురుకుల పాఠశాల నిర్మాణ పనులు పూర్తై ప్రారంభం కూడా అయ్యేదని, ప్రభుత్వం మారడంతో గ్రహణం పట్టిందని విద్యార్థుల తల్లిదండులు వాపోతున్నారు.

అరకొర సౌకర్యాల మధ్య విద్యాభ్యాసం

బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో గురుకుల పాఠశాలను నిర్వహిస్తుండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.ఈ రెండు విద్యాసంస్థలకు సంబంధించి మొత్తం 350 మంది ఉన్నారు. వీరు ఇరుకు గదుల్లో అరకొర సౌకర్యాల మధ్య చదువు సాగించలేకపోతున్నారు. తాగునీటికి, భోజనానికి, వసతికి సమస్యగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల నిర్మాణ పనులు పూర్తికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.



ఇంటిగ్రేటెడ్ కళాశాల వసతి గృహంలో పాఠశాల నిర్వహణ

పిల్లలకు ఇబ్బందిగా మారింది



మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాలలో 5 నుంచి 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులు 250 మంది ఉన్నారు. సొంత భవనం లేకపోవడంతో తాత్కాలికంగా కళాశాల వసతిగృహంలో పాఠశాలను నిర్వహిస్తున్నాం. ఇందులో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు వసతులు లేవు. గురుకుల పాఠశాలకు సొంత భవనం ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– బాలాజీ, ప్రిన్సిపాల్, మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాల

బంగారు గొలుసు చోరీ

బేతంచెర్ల : వివాహ వేడుకకు హాజరైన ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన పట్టణంలోని జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం చోటు చేసుకుంది. పగిడాల మండలం నెహ్రూనగర్‌కు చెందిన వసంత జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న వివాహ వేడుకకు హాజరై అక్కడే పెళ్లి వారితో కలిసి నిద్రించారు. శనివారం తెల్లవారు జామున తన మెడలోని మూడు తులాల బంగారు చైనును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. దీనిపై బాధిత మహిళ బేతంచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

వేధింపుల కేసు నమోదు

బనగానపల్లె రూరల్: భర్త వేధిస్తున్నట్లు ఓ మహిళ నందివర్గం పోలీసులను ఆశ్రయించింది. ఎస్‌ఐ వెంకట సుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన షేక్ హుస్సేన్‌బాషా తన కూతురు అయేషాను నాలుగేళ్ల క్రితం చెరువుపల్లె గ్రామానికి చెందిన హైదర్ సాహెబ్‌గారి పెద్ద అబ్బాస్‌మియ్యా కుమారుడు బాషాకు ఇచ్చి వివాహం చేశారు. అయితే బాషా మద్యానికి బానిస కావడంతో పాటు వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని భార్యను వేధించడం మొదలు పెట్టాడు. విసిగిపోయిన ఆమె ఈ నెల 6వ తేది అక్రమ సంబంధంపై భర్తను ప్రశ్నించింది. ఇందుకు ఆగ్రహించిన బాషా కర్రతో ఆమె తలపై కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదుతో బాషాపై వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేశభక్తిని అలవర్చుకోవాలి



ఆధ్యాత్మిక సందేశమిస్తున్న జయదేవానంద

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ దైవభక్తితోపాటు దేశభక్తిని అలవర్చుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచారకులు జయదేవానంద సూచించారు. మండలంలోని రేవనూరులో టీటీడీ ఆధ్వర్యంలో ఐదు రోజుల నుంచి కొనసాగుతున్న ధార్మిక కార్యక్రమాలు శనివారం ముగిశాయి. చివరి రోజు పౌర్ణమిని పురస్కరించుకుని గ్రామంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం సురక్షితంగా ఉంటే ధర్మం సురక్షితంగా ఉంటుందని, భక్తి భావన పెరుగుతుందన్నారు. ప్రజల్లో సమైక్యత భావన నెలకొల్పేందుకు పండుగలు ఎంతో దోహద పడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఆలయ ధర్మకర్త సంజీవరెడ్డి, సర్పంచ్ సరస్వతమ్మ, భజన మండలి సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, హనుమంతరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం



మాట్లాడుతున్న ఉశేన్‌రెడ్డి

బేతంచెర్ల : పర్యావరణ పరిరక్షణ కోసం వినాయక ఉత్సవాల్లో మట్టి విగ్రహాలను పూజిద్దామని, అలాగే.. శబ్ద కాలుష్య నివారణకు డీజేలను ఉత్సవాల్లో నిషేధిస్తున్నట్లు, నిర్వాహకులు సహకరించాలని గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ అధ్యక్షుడు ఉశేన్ రెడ్డి, గ్రూపు ఆలయాల కమిటీ చైర్మన్ మారుతి కృష్ణన్ తెలిపారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకొని శనివారం స్థానిక సౌత్ ఇండియా కార్యాలయంలో బీజేపీ జిల్లా నాయకుడు నాగమోహన్‌రెడ్డి, సభ్యులు శ్రీధర్ రెడ్డి, పుల్లారెడ్డితో కలిసి ఉత్సవ సమితి సభ్యుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో వినాయక విగ్రహాల ఏర్పాటుకు జిల్లాలోనే మంచి పేరు ఉందని, ఇందుకు అనుగుణంగా నిమజ్జనం రోజు కూడా ప్రశాంతంగా నిమజ్జనం చేసుకోవాలని, ఊరేగింపులో డీజేలను నిషేధించామని, వాటి స్థానంలో చెక్క భజనలు, కోలాటాలు ఏర్పాటు చేసుకొని సంస్కృతి, సంప్రదాయాలను ఇనుమడింపజేయాలని కోరారు. పోలూరు రాఘవరెడ్డి.గాజుల హరి కృష్ణ,నాగేశ్వరరెడ్డి, ఉన్నం రవి, మధుమోహన్‌రెడ్డి, మురళీకృష్ణ, శ్రీను ఉన్నారు.



అమ్మ హోటల్ ప్రాంతంలో అమ్మకానికి ఉంచిన వినాయక ప్రతిమలు

లంబోదరుడి ఆగమనం!



సాయిబాబా గుడి వద్ద విక్రయించేందుకు తెచ్చిన గణపతి విగ్రహాలు

డోన్: ఈనెల 27వ తేదీ నుంచి జరిగే వినాయకచవితి ఉత్సవాల కోసం వివిధ ఆకృతుల్లో గణపతి విగ్రహాలను అమ్మకానికి సిద్ధం చేశారు.

స్థానిక రూరల్ పోలీసుస్టేషన్, సాయిబాబా గుడి, ప్రభుత్వ ఐటీఐ, ఇందిరానగర్, అమ్మ హోటల్ తదితర ప్రాంతాల్లో అడుగు ఎత్తు విగ్రహం నుంచి 20 అడుగుల ఎత్తు విగ్రహాల వరకు అందుబాటులో ఉన్నాయి. వర్షాలు ఏకధాటిగా కురుస్తుండటంతో విగ్రహాల రక్షణ కోసం టార్పాలిన్లతో భారీ షెడ్లను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మీయాగం



యాగం చేస్తున్న దృశ్యం

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో వెలిసిన గంగ, గౌరీ మరకతలింగేశ్వరస్వామి, నవగ్రహాల ఆలయాల వద్ద శ్రావణమాసం, పౌర్ణమి పురస్కరించుకుని శనివారం మహాలక్ష్మీయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో రుత్వికులు, అర్చకులు విశేష పూజలు జరిపారు. యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, మహాలక్ష్మీయాగం, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందించి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవం.. వేంకటేశ్వరుడి కల్యాణం





తాళిబొట్లను చూపుతున్న పండితులు, భూదేవి, శ్రీదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

డోన్/డోన్ టౌన్ : శ్రావణ పూర్ణిమను పురస్కరించుకొని స్థానిక వీరాంజనేయ స్వామి కొండపై శనివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మాణిక్య ప్రభ సేవాసమితి గౌరవాధ్యక్షుడు కోట్రికె హరికిషన్ ఆధ్వర్యంలో 108 జంటలు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అన్నదానం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు కోట్రికె సురేష్, కార్యదర్శి మాకం ఆంజనేయులు, కోశాధికారి జొన్నలగడ్డ శ్రీధర్, సమన్వయకర్త కిషన్ సింగ్, దేవస్థానం ధర్మకర్తలు కృష్ణాంజనేయులుగౌడ్, శేషన్నగౌడ్, పురోహితులు లక్ష్మణకుమార్, ఒంటెద్దుబండి కిరణ్‌లు పాల్గొన్నారు.

వెంకటాపురంలో..

శ్రావణ శనివారం సందర్భంగా మండలంలోని వెంకటాపురం గ్రామంలోని చంద్రాయని కొండపై వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామికి గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు,అర్చనలు,మంగళ హారతులు తదితర ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేపట్టారు.



గుమ్మకొండ గ్రామంలో ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

గుమ్మకొండలో..

గుమ్మకొండ గ్రామ సమీప కొండల్లో వెలసిన శ్రీబంగారు కొండ పాతపాలెం అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ బొమ్మిరెడ్డి జ్యోతి..మహిళలకు గాజులు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తికి పల్లకీ సేవా నిర్వహించారు.

బస్సు ఢీకొని విద్యార్థికి గాయాలు

బేతంచెర్ల : పట్టణ సమీపంలోని అయ్యలచెరువు కాట వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో విద్యార్థికి గాయాలయ్యాయి. మాబాషా అనే విద్యార్థి సైకిల్‌పై వస్తుండగా కర్నూలు వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో బాలుడికి గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమ్మిత్తం వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



రాఖీ కట్టుకుంటున్న విద్యార్థులు

ప్యాపిలి: రక్షాబంధన్ పర్వదినం అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అని సరస్వతీ శిశు మందిరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయులు అన్నారు. స్థానిక పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రక్షాబంధన్ ప్రత్యేకతను వివరించారు. అనంతరం శిశు మందిరం విద్యార్థులు పరస్పరం రాఖీ కట్టుకున్నారు. అలాగే విద్యార్థులు పట్టణ ప్రజలకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

మహేష్‌బాబు జన్మదిన వేడుకలు

డోన్ టౌన్ : సినీ హీరో మహేష్‌బాబు 50వ జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో ఆయన అభిమానులు శనివారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మహేష్‌బాబు ఫ్యాన్స్ క్లబ్ అధ్యక్షుడు జమాల్‌వలి, కార్యదర్శి ఖాదర్, సభ్యులు గౌస్‌బాషా, హర్షద్, ఆర్.ఆర్.నాయుడు, చిరంజీవి, ఆరీఫ్ హుసేన్ బాబు సంబరాల్లో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో యాచకులకు స్వీట్లు,పండ్లు అందజేశారు.



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ఘనంగా రంగస్వామి గ్రామోత్సవం



నైవేద్యాన్ని సిద్ధం చేస్తున్న భక్తులు



ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండలంలోని కలచట్ల గ్రామంలో శనివారం దేవరకొండ రంగస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా రంగస్వామికి గ్రామోత్సవం నిర్వహించడం 60 సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. గ్రామోత్సవం అనంతరం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఇలా చేయడం ద్వారా సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామస్తులు పేర్కొన్నారు.

పోతుదొడ్డిలో ఆంజనేయస్వామికి..

పోతుదొడ్డి గ్రామంలో శనివారం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆంజనేయ స్వామి చిత్రపటానికి గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామ శివారు ప్రాంతంలో స్వామికి నైవేద్యం సమర్పించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని ఏటా శ్రావణ మాసంలో స్వామికి పూజలు చేయడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు.



అసంపూర్తిగా నిలిచిపోయిన హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణం

నిర్లక్ష్యం జబ్బు

- అసంపూర్తిగా హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణం

బనగానపల్లె : ప్రజారోగ్యానికి నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఇందులో భాగంగా ఊరూరా హెల్త్ క్లీనిక్‌లు ఏర్పాటు చేసి సేవలు ప్రారంభించింది. బనగానపల్లె పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం పక్కన రూ.17.85 లక్షలతో హెల్త్ క్లీనిక్‌కు పక్కా భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.పనులు ముగిసే సమయంలో కూటమి సర్కారు ఏర్పడటంతో పెండింగ్ పనులకు గ్రహణం పట్టింది. ఏడాది నుంచి పనులు జరగడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి భవన పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఎస్సార్బీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్ల దుస్థితి



కోర్టు వెనుక వైపు ఉన్న జగనన్న కాలనీకి వెళ్లే రహదారి అధ్వానంగా మారిన దృశ్యం

దారులన్నీ ఇంతే!

- అడుగుతీసి అడుగేయాలంటే నరకమే

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణ శివారులోని ఎస్సార్బీసీ, కోర్టు వెనుక వైపు ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిని నరకప్రాయంగా మారాయి. కాలనీలను మేజర్ గ్రామ పంచాయతీకి అనుసంధానం చేయకపోవడంతో ఆయా కాలనీల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్లు సైతం మట్టివే కావడంతో పెద్ద పెద్ద గుంతలు దర్శమిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా శిథిలమైన రోడ్లపై వర్షపునీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయమవుతుంది. పాదాచారులు సైతం నడిచేందుకు వీలులేకుండా పోయింది. ద్విచక్ర వాహన చోదకులు కింద పడి గాయాలపాలవుతున్నారు. కాలనీలకు వెళ్లే మెయిన్ రోడ్ల పరిస్థితి ఇలా ఉంటే అంతర్గత రోడ్ల దుస్థితి చెప్పనక్కరలేదు. అధికారులు స్పందించి జగనన్న కాలనీల్లో రోడ్ల అభివృద్ధితో పాటు మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక సాయం

డోన్ టౌన్ : నిరుపేద విద్యార్థుల చదువుల కోసం తమవంతు సాయంగా వైఎస్సార్ సీపీ నాయకుడు న్యాయవాది నాగభూషణం రెడ్డి కుమారుడు నవీన్‌కుమార్ రెడ్డి రూ.8వేలు అందించారు. శనివారం స్థానిక ఇన్నర్‌వీల్ క్లబ్‌లో 9వ తరగతి చదువుతున్న మోక్షితకు రూ.5వేలు, ఇంటర్ చదువుతున్న సౌమ్యకు రూ.3వేలు క్లబ్ అధ్యక్షురాలు శకుంతల చేతుల మీదుగా అందజేశారు.